ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పార్టీలో అన్యాయం జరిగిందని..

టిడిపి కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- ఉరేసుకొనేందుకు యత్నించగా అడ్డుకున్న స్థానికులు
- అనంతరం లారీ కింద పడబోయిన కార్యకర్త..
- కాపాడిన పోలీసులు



లారీ కింద పడబోతున్న వ్యక్తిని రక్షిస్తున్న స్థానికులు, పోలీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపిని నమ్ముకొని గత 20 సంవత్సరాలుగా ఉన్నానని, తనను కాదని నిన్నామొన్నా పార్టీలో చేరిన వారికి పనులు చేస్తూ.. తమకు అన్యాయం చేస్తున్నారని ఓ అధికారపార్టీ కార్యకర్త రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించిన ఘటన యర్రగొండపాలెంలో గురువారం సంచలనం రేకెత్తించింది. తొలుత ఉరేసుకొనేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం లారీ కింద పడబోయిన కార్యకర్తలను పోలీసులు కాపాడారు.

యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన టిడిపి కార్యకర్త బొందలపాటి నాగేంద్ర టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనకు అన్యాయం చేశాడని ఆరోపిస్తూ.. వినుకొండ రోడ్డు కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి గురువారం తాడుతో ఉరి వేసుకొనేందుకు యత్నించాడు.



ఉరేసుకొనేందుకు ప్రయత్నించిన యువకుడు

అది గమనించిన స్థానిక పండ్ల వ్యాపారులు వెంటనే ఆ యువకుడి మెడకు ఉన్న తాడు తొలగించి.. కిందకు దించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పార్టీ కోసం తాను అహర్నిశలూ శ్రమిస్తుంటే.. తమను పట్టించుకోకపోగా ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ పెత్తనం సాగిస్తున్నారని ▶ 2లో

జిల్లాకు దక్కిందేమిటి.?

- 'వెలిగొండ'కు మొక్కుబడిగా నిధులు
- కనిగిరి నియోజకవర్గంలో బయో ప్లాంట్
- వాలంటీర్ల వ్యవస్థపై తేల్చేసిన మంత్రి డోలా
- నేటితో ముగియనున్న అసెంబ్లీ సమావేశాలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

శాసనసభ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నాటితో ముగియనున్నాయి. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన సమావేశాల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.. ప్రతిపక్షం సమావేశాలకు దూరంగా ఉంది. జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలూ సభకు వెళ్లలేదు. దీంతో అంతా పాలకపక్షమే అయ్యింది. వాళ్లు వాళ్లు మాట్లాడుకోవడానికే సభ పరిమితమైంది. బడ్జెట్‌పైనా, బిల్లులపైనా పాలకపక్షమే చర్చలో పాల్గొంది. ఇక ఈ సమావేశాల ద్వారా జిల్లాకు ఏం దక్కిందనేది చర్చగా మారింది. బడ్జెట్‌లో నిధులు కేటాయింపులపై అన్ని పార్టీలూ అసంతృప్తి వ్యక్తం చేశాయి. పాలకపక్ష నేతలు ఏమీ అనలేక అంతా బాగుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు అత్తెసరు నిధులు కేటాయించారు. రూ.2 వేల కోట్లకు పైగా నిధులు అవసరం ఉండగా కేవలం రూ.394 కోట్లు కేటాయించారు. రాజకీయంగా ఎన్నికలకు ముందు ఉపయోగించుకున్న గుండ్లకమ్మకూ రూ.13 కోట్లు చూపారు. వెలిగొండకే ఆందోళన కలిగిస్తున్నాయి. రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రాజెక్టును సందర్శించిన ముగ్గురు మంత్రులు ప్రకటించారు. అయితే ఈ మేరకు నిధులు మాత్రం కేటాయించలేదు. నిర్వాసితులు ప్యాకేజీల కోసం ఎదురుచూస్తున్నారు. అవసరాలకు తగ్గట్టుగా నిధులు ఇవ్వకపోవడంతో దీనిపై సందిగ్ధం నెలకొంది. మిగతా రంగాలకు ప్రాధాన్యత కనిపించలేదు. రాష్ట్రస్థాయి కేటాయింపుల్లో జిల్లాకు వివిధ పథకాలకు రొటీన్‌గా వచ్చే నిధులు తప్ప ప్రత్యేకంగా ఏమీ లేవు. కేంద్రం వెనుకబడిన జిల్లాగా ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో ఎక్కడా ఈ వ్యవహారం కనిపించలేదు. కేంద్రం నుంచి వచ్చే వాటి ఆధారంగా ఇక్కడ ప్రత్యేక కేటాయింపులు కూడా ఏమీ లేవు. వెనుకబడిన ప్రాంతాలకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఇక రిలయన్స్‌తో ఒప్పందంలో భాగంగా కనిగిరి ప్రాంతంలో బయో ఇంధన ప్లాంటు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. ఇవే ప్రత్యేకంగా కనిపించాయి. ఇక విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పలువురు సభ్యులు విద్యుత్ అంశాలపై వేసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వం తప్పిదాలతోనే ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీలు వేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. విద్యుత్ సంస్థల నష్టాలకు గత ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు. మంత్రి డోలా వీరాంజనేయ స్వామి వాలంటీర్ వ్యవస్థపై స్పష్టత ఇచ్చారు. గత ప్రభుత్వం రెన్యువల్ చేయనందున వాలంటీర్లను ఇప్పుడు కొనసాగించలేమని తేల్చేశారు. ఇక వాలంటీర్లు ఇంటికేనని చెప్పేశారు. ఇప్పటి వరకూ ఉన్న ఊగిసలాట కూడా వీడిపోయింది. ఎన్నికలకు ముందు వాలంటీర్లతో వైసిపి నేతలు రాజీనామాలు చేయించారు. పైగా వాళ్లను కొనసాగిస్తూ ప్రభుత్వం కూడా ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే ▶ 2లో

ఫీజు చెల్లించలేదని..

కాలేజీ నుంచి పంపించేశారు..

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- 87 మందిని మిడ్ ఎగ్జామ్ రాయనివ్వని పరిస్థితి..
- ఫీజు కడితేనే పరీక్ష రాయనిస్తామని బయటికి పంపిన వైనం..
- ఇదీ ఒంగోలులో క్విస్ కళాశాల యాజమాన్యం నిర్వాకం



పొలం పనికి వెళ్లి బస్తాలు మోస్తున్న విద్యార్థి చక్రధర్ నాయుడు

ప్రజాశక్తి - పంగులూరు

'ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తాం, ఫీజు చెల్లించే వరకు ఇంటి దగ్గరే ఉండండి. ఫీజు చెల్లించిన వారు మాత్రమే పరీక్ష రాయండి' అంటూ ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఆ కళాలలో బీ ఫార్మసీ 2వ సంవత్సరం చదువుతున్న 87మంది విద్యార్థులను కాలేజీ నుంచి బయటకు గెంటేసింది. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామంటూ విద్యార్థులను మిడ్ ఎగ్జామ్ రాయకుండా నిలిపివేశారు. ఒక్కసారిగా ఫీజు చెల్లించలేక, ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ వేయక విద్యార్థులు నా నా అగచాట్లు పడుతున్నారు. చివరకు ఎగ్జామ్ రాయలేక ఇళ్ల దగ్గరే ఉంటున్నారు. అలాంటి వారిలో మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన నందిపాటి చక్రధర్ నాయుడు ఉన్నారు. చక్రధర్ నాయుడు క్విస్ కాలేజీలో బి ఫార్మసీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఇతనికి సంవత్సరానికి రూ.80వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఈ రూ.80వేలను కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే మొదటి సంవత్సరం ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ కింద రూ.20వేలను చక్రధర్ నాయుడు పేరుతో వేశారు. ఆ రూ.20 వేలు కళాశాల యాజ మాన్యం తీసుకుంది. మిగతా చెల్లించాల్సిన రూ.60వేలల్లో చక్రధర్ నాయుడు మరో రూ.20వేలు చెల్లించాడు. మొదటి సంవత్సరానికి సంబంధించి ఇంకా రూ.40వేలు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ ఫీజును వెంటనే చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వమని కళాశాల యాజమాన్యం విద్యార్థులను హెచ్చరించింది. చక్రధర్ నాయుడు క్లాసులో 94మంది విద్యార్థులు ఉండగా అందులో 87 మంది ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఫీజులు చెల్లించలేకపోయారు. ఈ 87 మందిని కళాశాల యాజమాన్యం పరీక్ష రాయినీయకుండా బయటికి పంపింది. ఈనెల 18 నుండి 21వరకు జరిగిన మిడ్ ఎగ్జామ్-4ను వీరి చేత రాయనీయలేదు. అప్పటి నుండి చక్రధర్ నాయుడు ఇంటి దగ్గరే ▶ 2లో

ఇసుక అక్రమ తవ్వకాలపై

కదిలిన అధికార యంత్రాంగం

- బధిరుల పాఠశాల వెనుకవైపు తవ్వకాలను గుర్తించిన అధికారులు
- బాధ్యులపై చర్యల కోసం నివేదిక



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల ప్రాంతంలో జోరుగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు మీడియాలో వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలో గురువారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. బాపట్ల సమీపంలోని బధిరుల పాఠశాల వెనుక వైపు అక్రమంగా ఇసుక త్రవ్వకాలు నిర్వహిస్తున్న ప్రదేశాలను బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రాజేష్, బాపట్ల డిఎస్‌పి జి.రామాంజనేయులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. కానీ అధికారులు తనిఖీకి వెళ్లిన సమయంలో ఆ ప్రదేశంలో ఇసుక తరలిస్తూ వ్యక్తులు గానీ, యంత్రాలు గానీ లేవు. ఇప్పటి వరకు అక్కడ తవ్వబడిన పెద్ద గుంతలను అధికారులు పరిశీలించారు. బాపట్ల వెస్ట్ రెవిన్యూ గ్రామ పరిధిలో వెదుళ్ళపల్లి శివారు గ్రామ పరిధిలో బదిరుల పాఠశాలకు వెనుకవైపున తవ్వకాలు నిర్వహించిన ప్రదేశం డి.కె పట్టా భూమి సర్వేనెంబర్ 130/3 లోనివిగా గుర్తించారు. అక్కడ నుంచి ఇసుక తరలింపులు జరిగినట్లు వెల్లడి కావడంతో సం యుక్త తనిఖీ బందం సంబంధిత తహశీల్దార్, బాపట్ల కార్యాలయ సిబ్బంది మరియు గనులు మరియు భూగర్భ శాఖ బాపట్ల కార్యాలయ సిబ్బంది కలిసి పూర్తిస్థాయి విచారణ జరిపి ఈ ప్రదేశంలో ఎంత మేరకు తవ్వకాలు జరిగాయని అంచనా కోసం కొలతలు వేశారు. ఇసుక తవ్వకాలకు బాధ్యులైన వ్యక్తులను విచారించి పూర్తిస్థాయి విచారణ నివేదికలను తయారు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ రాజేష్ తెలిపారు. జిల్లా పరిధిలో తమ దృష్టికి వచ్చిన అన్ని ఫిర్యాదులనూ పరిగణనలోకి ▶ 2లో

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి : సిఐ

ప్రజాశక్తి-కొండపి

ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని కొండపి సర్కిల్ సిఐ సోమశేఖర్ తెలిపారు. స్థానిక పోలీసు ఎదుట సిఐ సోమశేఖర్, ఎస్ఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలు రక్షిస్తుందన్నారు. అనంతరం హెల్మెట్ ధరిస్తామని వాహన చోదకులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ సోమశేఖర్

జరుగుమల్లి : ఆటో డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ ,ఆర్‌సి కాగితాలు కలిగి ఉండాలని ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో నింబధనలకు మించి ప్రయాణికులను ఎక్కిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారణమే ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు.

జిల్లాకు దక్కిందేమిటి.?

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశం వాలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని ప్రకటించింది. వైసిపి ఓటమికి వాలంటీర్ వ్యవస్థే కారణమని ఆ పార్టీ నేతలు తేల్చుకున్నారు. దీంతో వాంటీర్లు వ్యవస్థను కొనసాగించాలనే ఆలోచను నుంచి కూటమి ప్రభుత్వం వెనుకడుగు వేసింది. ఇప్పుడు సభలో ఇదే విషయాన్ని ప్రకటించారు. దొనకొండ పరిశ్రమల కేంద్రం గానీ, గతంలో ప్రకటించిన హామీలకు స్పష్టత గానీ ఈ సమావేశాల్లో కనిపించలేదు. వెలిగొండకు కేటాయించిన నిధులపై స్పందించిన ఉమ్మడి జిల్లా మంత్రులు,ఎమ్మెల్యేలు సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కార్యకర్త ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

ఎరిక్షన్‌బాబుపై ఆరోపణలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పి.చౌడయ్య అక్కడకు చేరుకొని అతనికి సర్దిచెప్పి అదుపులోకి తీసుకుంటుండగా.. ప్రతిఘటించిన ఆ యువకుడు అటువైపు వస్తున్న లారీ కింద పడిపోయాడు. వెంటనే పోలీసులు స్పందించి.. ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా యువ కుడు నాగేంద్ర తన భార్య చెన్నమ్మతో కలిసి ఎస్సై చౌడయ్యకు తన ఆవేదనను తెలియజేశారు. వారికి సర్దిచెప్పిన ఎస్సై చౌడయ్య ఆ యువకుడిని వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కదిలిన అధికార యంత్రాంగం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొని సదరు ప్రదేశాలను తనిఖీ చేసి.. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 39 మంది వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన సుమారుగా 129 కేసులలో రూ.25.7 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని రాజేష్ తెలిపారు.

ఫీజు చెల్లించలేదని.. కాలేజీ నుంచి పంపించేశారు..

(మొదటిపేజీ తరువాయి)

ఉంటూ పొలం పనులకు వెళుతున్నాడు. 87మంది విద్యార్థుల్లో 25మంది విద్యార్థులు గురువారం ఫీజు చెల్లించి పరీక్ష రాసినట్లు తెలిసిందని చక్రధర్ నాయుడు తెలిపాడు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలలో వేయకపోవడం, ఫీజు చెల్లించే స్థోమత విద్యార్థుల కుటుంబాల్లో లేకపోవడం వల్ల చదువులకు దూరమవుతున్నారు. ఈ సందర్భంగా చక్రధర్ నాయుడు తండ్రి నిరంజన్ మాట్లాడుతూ చక్రధర్ నాయుడుకి రూ.40వేలు కాలేజీ ఫీజు చెల్లించాలని, వేరే కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న తన కుమార్తెకు కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ రాకపోవడంతో రూ.50వేలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఇద్దరికీ ఫీజు చెల్లించే పరిస్థితి తనకు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - మద్దిపాడు : సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ జెఇ డి.ప్రసాద్ బాబు తెలిపారు. మండల పరిధిలోని దొడ్డవరంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణసయంలో నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. అనంతరం రహదారిని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ రవిబాబు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామపంచాయతీలో ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్న కార్మికుడు మధు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మాజీ వార్డు నెంబరు షేక్ సంధాని మధుకు అండగా నిలిచారు. తన వంతు సాయంగా నగదును పంచాయతీ కార్యదర్శి ఎన్.జగదీష్ చేతుల మీదగా మధుకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు నక్క శ్రీనివాసులు, లక్ష్మణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-కొండపి : కొండపి ఎంఆర్‌సిలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న కె.నాగేశ్వరావు 20 సంవత్సరాలుగా అమూల్యమైన సేవలు అందించినట్లు ఎంఇఒలు కె.సురేఖ, రామారావు తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన నాగేశ్వరరావుకు గురువారం సన్మానసభ నిర్వహించారు. శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామాంజనేయులు, తహశీల్దారు పి.మురళి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీవిద్యానికేతన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శింగరాయకొండ : ఒంగోలులో జిల్లా స్థాయిలో నిర్వహించిన 'బంగారు బాల్యం' పోటీల్లో శింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఎం, కీర్తన స్లొగన్స్‌లో ద్వితీయ స్థానం, లోగో మేకింగ్‌లో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. ఎలా క్యూషన్‌లో తమ విద్యార్థులు విజయం సాధించారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా చేతుల మీదుగా ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి దామోదర్, జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కొండపి

జిల్లా స్థాయిలో బంగారు బాల్యంపై నిర్వహించిన పోటీల్లో కొండపి మండల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఇఒలు కె.సురేఖ, రామారావు తెలిపారు. డ్రాయింగ్ పోటీల్లో కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని జె.సిరివల్లి ద్వితీయ స్థానం సాధించింది. చిత్రలేఖనం పోటీల్లో స్థానిక అంబేద్కర్ గురుకుల 8వ తరగతి విద్యార్థిని డి.నిశిషా ద్వితీయ స్థానం సాధించింది. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిపికెట్లు, మెడల్, రూ.1500 పారితోషకం అందజేసి సన్మానించారు. కొండపి మండల విద్యాశాఖ కార్యాలయంలో విజేతలకు గురువారం అభినందన సభ నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి.మురళి, ఎంపిడిఒ రామాంజనేయులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న సంస్థ గౌరవాధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు

ఘనంగా టెలివిజన్ డే

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఒంగోలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెకానిక్ అసోసియేషన్, ఒంగోలు ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ జెండాను సంస్థ గౌరవ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు ఆవిష్కరించారు. టీవీ రూపకర్త జాన్ లోగి బెయిర్డ్ చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ మెకానిక్ శివకుమార్ ను శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంటెనపల్లి శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారాజు, ఒంగోలు ఎలక్ట్రానిక్ డెవలప్మెంట్ అసోసియేషన్ కార్యదర్శి కె.చిరంజీవి, హుస్సేన్‌బాషా, సురేష్ కుమార్, బుజ్జి, వెంకటేశ్వర్లు, జయరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితులను

కఠినంగా శిక్షించాలి

◆ ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా జిల్లా కమిటీ నేతల డిమాండ్ ◆ ఒంగోలులో విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విశాఖపట్నంలో లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక లాయర్‌పేట సాయిబాబా గుడి సెంటర్, ప్రకాశం పంతులు బొమ్మ వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువైందని, ఈ భద్రత వైఫల్యాలకు కూటమి ప్రభుత్వానిదే బాధ్యత అని తెలిపారు. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఘటన మరువకముందే లా విద్యార్థినిపై క్రూరమైన దాడి జరగడం అమానుషమన్నారు. విశాఖలో జరిగిన మూక దాడి పట్ల సభ్య సమాజం తల దించుకునేటట్లు ఉందని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులలో మహిళలు బలి పశువులుగా మారారని, వీటిపై కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి ఏరులై పారుతోందని, విచ్చలవిడిగా మత్తు పదార్థాలను చెలామణి చేయడంతో యువత, ప్రజానీకం బానిసై మహిళలపై పాశవిక, లైంగిక దాడులకు పాల్పడుతున్నారని, వెంటనే వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామన్న మాటలు, ప్రకటనలు గాలిలో దీపంలా మారాయని విమర్శించారు. ఏదో ఒకచోట ప్రతిరోజూ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. పోర్న్‌వెబ్ సైట్లను రద్దు చేయాలని, పోక్సో చట్టం ద్వారా వెంటనే విచారణ చేపట్టాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మాలతి, నాగుర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద్ద గోవిందమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్ పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పుల్లలచెరువు మండలంలోని పెద్ద పిఆర్‌సి తాండా అటవీ సమీపంలో ఒంగోలు ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్లు విజయ మోహన్, ఎస్.రామారావు, ఆర్.నరహరి, సిఐలు డి.మౌలాలి ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించినట్లు యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. చుట్టు పక్కల ఉన్న నాటుసారా బట్టీలను పగులగొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో హెడ్ కానిస్టేబుల్ సత్తా

స్వర్ణ, రజత పతకాలు సాధించిన నాగరాజు

అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ నాగరాజు అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటారు. 40 ప్లస్ విభాగంలో షాట్ పుట్‌లో స్వర్ణ, జావలిన్ త్రోలో రజత పతకాలు సాధించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నాగరాజును శాలువతో ఘనంగా సన్మానించి అభినందించారు. అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు వెస్ట్ బెంగాల్‌లోని న్యూ కూచ్ బీహార్ స్టేడియంలో నవంబర్ 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీలలో ఇండియా, బాంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, థాయిలాండ్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా పోలీస్ శాఖ నుంచి 40 ప్లస్ విభాగంలో షాట్ పుట్, జావలిన్ త్రో క్రీడలలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ నాగరాజు పాల్గొన్నారు. షాట్ పుట్‌లో స్వర్ణ పతకం, జావలిన్ త్రోలో రజత పతకం సాధించి బాపట్ల జిల్లా పోలీస్ శాఖ సత్తా అంతర్జాతీయ స్థాయిలో చాటారు. 2002లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా నియమితులైన నాగరాజు ప్రస్తుతం చీరాల టూటౌన్ పరిధిలో ఎస్‌బీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నాగరాజు అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటి జిల్లా పోలీస్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజులలో మరిన్ని క్రీడా పోటీలలో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. నాగరాజును స్ఫూర్తిగా తీసుకొని జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనాలన్నారు. డిసెంబర్ నెలలో జిల్లా పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ నిర్వహించబడుతుందన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో నిర్వహించే వివిధ రకాల క్రీడాపోటీలలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ పాల్గొన్నారు.



నాగరాజును అభినందిస్తున్న ఎస్పీ తుషార్ డూడి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక కాపు కళ్యాణ మండపంలో అంతర్జాతీయ బాలల దినోత్సవ సందర్భంగా ఎమ్మెస్ రెడ్డి స్పోర్ట్స్ మీట్ 2024 అవార్డు ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు విచ్చేసి క్రికెట్ విజేతలకు కప్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 9 మంది వ్యాయామ ఉపాధ్యాయులు కలిగిన ఏకైక స్కూల్ అపెక్స్ అని తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ జోత్స్న, శ్రీ హర్షిణి విద్యాసంస్థల అధినేత, ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గోరంట్ల రవికుమార్, కళాశాల డీన్ దాది ఆంజనేయులు, శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ శివకోటిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ క్రీడా సంబరాలలో ఆకృతి అకాడమీ చైర్మన్ పి.రామాంజనేయులు, ఏసీఈ చైర్మన్ పి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకట దాస్

హోటల్‌లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆంధ్ర విలాస్ హోటల్‌ను నగర పంచాయతీ కమిషనర్ వెంకట దాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ హోటల్‌పై వరుస ఫిర్యాదులు అందడంతో ఆయన తనిఖీ నిర్వహించి అక్కడ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హోటల్ యజమానులతో మాట్లాడుతూ శుభ్రమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగదారులకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ టపావలి, సిబ్బంది ఉన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారి టూర్ డైరీలో భాగంగా పెద్దారవీడు గ్రామంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. షాపులోని పలు రిజిస్టర్లను, బిల్ పుస్తకాలను పరిశీలించారు. రైతులకు పురుగుమందులు, ఎరువులు కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా బయో మందులు అమ్మేటప్పుడు గవర్నమెంట్ ద్వారా ఆమోదం పొందిన సర్టిఫైడ్‌వి మాత్రమే విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు ఎంట్రీలు చేసుకోవాలన్నారు.

పశువుల బీడు ఆక్రమణను అడ్డుకోవాలి

తహశీల్దార్‌కు కారుమానుపల్లె గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-తర్లుపాడు

పశువులకు, జీవాల మేతకు ఇబ్బంది లేకుండా గతంలో ప్రభుత్వం కేటాయించిన మేత భూములను అక్రమార్కుల చెర నుంచి విడిపించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కారుమానుపల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ విజయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ కారుమానుపల్లి గ్రామ ఇలాకాలోని సర్వే నెంబర్ 72లో 128 ఎకరాల భూములను గ్రామస్తులు పశువులకు మేతబీడుగా ఉపయోగించుకుంటున్నారు. సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ఆ భూముల విషయమై గ్రామస్తుల మధ్య వివాదం చెలరేగడంతో అప్పటి తహశీల్దార్ గ్రామంలో సమగ్ర విచారణ చేపట్టారు. పశువుల మేత బీడులు ఎవరికీ సొంతం కాదని, గ్రామస్తులు పశువులకు మేత కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని అప్పట్లో హెచ్చరించారు. ఇటీవల కాలంలో కొందరు గ్రామస్తులు, ఆక్రమణదారులతో చేతులు కలిపి తప్పుడు పట్టాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని కారుమానుపల్లి వాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దొండపాటి వెంగళరెడ్డి, గాయం శ్రీనివాస్ రెడ్డి, దొండపాటి వెంకటేశ్వర రెడ్డి, వి.మూర్తయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

సిపిఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - కొల్లూరు

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల భారం ప్రజలపై వేయడమంటే ప్రజలను మోసం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సిపిఎం మండల 3వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు, ఇతర ధరలు పెంచేది లేదని, వైసిపి ప్రభుత్వ విధానాలపై బాదుడే బాదుడు కార్యక్రమంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు మర్చిపోయి అధికారానికి వచ్చిన తర్వాత ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్పొరేట్, మతోన్మాద విధనాలు ఆపకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని అన్నారు. దేశంలో పూర్తిగా మెజార్టీ లేని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని అన్నారు. మోడీ ప్రభుత్వం ధరల పెంచడంతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక ఐదు నెలల్లోనే పెద్ద ఎత్తున ప్రజలపై భారాలు వేస్తుందని అన్నారు. ధరల పెంపుదల, విద్యుత్ ట్రూప్ చార్జీలు 15నెలల పాటు రూ.7వేల కోట్లు వసూలు చేయాలనుకోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు.



సిపిఎం మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. సభకు పి నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. కామ్రేడ్ ధూళిపాళ్ల సుబ్బారావు ప్రాంగణం, వల్లభనేని కృష్ణమూర్తి నగర్‌లో సీనియర్ సభ్యులు కృపానందం జండా ఆవిష్కరించి సభను ప్రారంభించారు. సభలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు, తోకలవారిపాలెం సర్పంచి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలో లంక భూములకు పట్టలు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న ఆర్సి భూములు పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. స్మశాన స్థలాలు లేని దళిత వాడలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. అనంతరం నూతన కమిటీ కన్వీనర్‌గా వేములపల్లి వెంకట రామయ్య, కో కన్వీనర్ పంతగాని నాగమల్లేశ్వరరావు, సభ్యులుగా బి సుబ్బారావు, టి సురేష్, పి మరియారావు ఎన్నికయ్యారు.

ఎఎన్ఎంలను వైద్యారోగ్య విధులకే వినియోగించాలి

ప్రజాశక్తి - బాపట్ల

సచివాలయ పరిధిలో పనిచేస్తున్న విలేజ్ వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్ 3 ఎఎన్ఎంలను వైద్య ఆరోగ్య శాఖకు సంబం ధించిన సేవలకు మాత్రమే వినియోగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు డిఎంహెచ్ఓ ఎస్ విజయమ్మకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీ యూనియన్ నాయకులు వై సుభాషిని మాట్లాడుతూ విలేజ్ అండ్ వార్డు సచివాల య పరిధిలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీ గ్రేడ్ 3 ఎఎన్ఎంలను వైద్య, ఆరోగ్య శాఖ విధులతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వివిధ రకాల ఆన్‌లైన్ సేవలు చేయాలని వార్డ్ విలేజ్ సచివాలయ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ అధికారులు సచివాలయ అడ్మిన్ అదనపు విధులు నిర్వర్తించాలని ఆదేశిస్తున్నారని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్వహించాల్సిన రకరకాల ఆన్‌లైన్ యాప్ ద్వారా అదనపు సేవలతో హెల్త్ సెక్రటరీలు పూర్తికాలం వెచ్చించి పనిచేస్తే తప్ప సర్వేలు పూర్తి చేయడం కష్టతరమవుతోందని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఎన్సీడీసీడీ హౌస్ హెూల్డ్ సర్వే ప్రతి ఒక్క హెల్త్ సెక్రటరీకి టార్గెట్లను పెట్టి పూర్తిచేయాలని ఆదేశిస్తున్నారని అన్నారు. ఎన్సిడిసిడి సర్వేతో పాటు ప్రతి గురువారం ప్రభుత్వ పాఠశాలల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. 18ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలని అన్నారు. ప్రతి శని వారం అంగన్వాడిలో చిన్నారులకు ఆర్‌బి ఎస్‌కె ప్రోగ్రాం నిర్వహించాల్సి ఉంది. వైద్యా ధికారులు ఎన్సీటీసీడి సర్వేలో భాగంగా ప్రతిరోజు 5నుండి 15గృహాలు సర్వే చేయా లని టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు రకరకాల సర్వేలు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని అన్నారు. ఎఎన్ఎంకి వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన విధులకు మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి కృష్ణవేణి, ఎం పద్మ, ప్రియాంక, అరుణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, శరత్ పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య అధికారి వినతిపత్రం అందిస్తున్న ఎఎన్ఎంలు

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరి ష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లా యిస్ ఫెడరేషన్ అధ్యక్షులు యు సామ్యూల్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు పారిశుద్ధ్య కార్మికులతోపాటు సమానంగా జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం వినతి పత్రాన్ని కమిషనర్‌కు అం దించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం మాట్లాడారు. కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికు లకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. పనిచేసేం దుకు అవసరమైన పనిముట్లు కిట్లు సకాలంలో అందించాలని అన్నారు. చట్టబద్ధమైన వారాంతపు క్యాజువల్ జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికు లకు ఇస్తున్న విధంగా 2జతల యూనిఫాం, స్టిచ్చింగ్ చార్జీ, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ప్రతి ఏటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ వర్కర్స్ అధ్యక్షులు ఉసురుపాటి, కార్యదర్శి వి జాన్, జి మార్క్, కె మారుతి పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

చీరాల : దీర్ఘకాలంగా పెండింగులో వున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఇంజినీరింగ్ ఎంప్లాయీస్ ప్రెసిడెంట్ రుద్రబోయిన బాజీబాబు మాట్లాడుతు దీర్ఘకాలంగా పెండింగులో వున్న సమస్యలు పరిష్కరించాలని, గత సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ చిమటా వీరాస్వామి, ట్రెజరరీ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సురేష్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయునిగా ముఖ్య మంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పవని భానుచంద్ర మూర్తిని స్థానిక ఎన్ఆర్పిఎం పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఘనంగా సత్కరించారు. సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతు ముఖ్య మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఎంతో అభినంద నీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆలూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎయుఎల్ పార్వతి, జి రమేష్, వెంకటేశ్వరరెడ్డి, జగన్నాధాచార్యులు పాల్గొన్నారు.



భానుచంద్రమూర్తికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు



ఎంఎల్ఎ ఏలూరిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎంఎల్ఏను కలిసిన నాయకులు

ప్రశజాశక్తి - యద్దనపూడి

మండలానికి చెందిన టిడిపి నాయకులు విజనరీ అవార్డు గ్రహీత శాసన ఏలూరి సాంబశివరావును గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సిహెచ్ రామకృష్ణ, దొడ్డా అప్పారావు, రంగయ్య పాల్గొన్నారు.

నేడు బాపట్లలో వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - బాపట్ల

వాలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఈనెల 22న బాపట్ల పాత బస్టాండు సెంటర్లో జరిగే వాలంటీర్ల ధర్నా సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రూ.10వేల జీతం ఇస్తామని, వాలంటీర్లు అందరినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఎన్నికల అనంతరం వాలంటీర్ వ్యవస్థ ఉనికిలో లేదని చెప్పడం అన్యాయమని అన్నా రు. విజయవాడలో వరదల సందర్భంలో వాలంటీరు సేవలు ఉపయోగించుకున్నప్పుడు ఈ విషయం వారికి తెలియదాని ప్రశ్నించారు. వాలంటీర్లు అందరినీ కొనసాగించాలని కోరుతూ ఈ నెల 22న బాపట్లలో ధర్నా నిర్వహిస్తామని అన్నారు. వాలంటీర్లు అందరూ బాపట్ల పాత బస్టాండ్ వద్దకు రావాలని కోరారు.

చేనేతల ఆత్మహత్యలు నివారించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చేనేత కార్మికుల ఆత్మహత్యలు వెంటనే నివారించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ గురువారం డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్య సాయి జిల్లా పరిగి మండలం పెద్దరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ అప్పుల భారం అధికమై ఆత్మహత్య చేసుకోవటం బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. చేనేతపై వేసిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని కోరారు. గతంలో ఉన్న యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ పండ్, పావలా వడ్డీ తదితర పథకాలను పునరుద్ధరించాలని కోరారు. చేనేత కార్మికులకు ముద్ర లోన్లు 50శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడు ఆదినారాయణ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.



కంటి పరీక్షలు ఉచితంగా చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని ఏమినేనివారిపాలెంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గూడవల్లి ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 88మంది పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 22మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వారికి త్వరలో ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. మిగిలిన 66 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. డాక్టర్ ఆనందకుమారి, దాసరి రమణ పాల్గొన్నారు.



భూ వివాదంపై కసాపురంలో విచారిస్తున్న తహశీల్దారు

భూవివాదంపై తహశీల్దారు విచారణ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కస్యా పురంలో నెల కొన్న భూ వివాదంపై తహ శీల్దారు పోపూరి సింగారావు గురువారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన దూళిపాళ్ల గంగయ్య అనే వ్యక్తి సర్వేనెంబర్ 748లో 5 ఎకరాల 93 సెంట్లు భూవివాదానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాడు. ఈ విషయమై విచారించేందుకు తహశీల్దారు సింగారావు, విఆర్ఓ సుమతి, గ్రామ సర్వేయర్ రాజతో కలిసి కశ్యాపురం గ్రామం వచ్చి విచారణ జరిపారు.

గాంధీపార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం లోని రంగారాయుడు చెరువు వద్ద ఉన్న గాంధీ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మర్మతులు చేయాలని సిపిఎం నగర నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం నగర నాయకత్వ బందం గాంధీ పార్కును గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా బృదం నాయకుడు, సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న పిల్లలు ఆట వస్తువులు ఉన్న స్థలంలో గత నాలుగు సంవత్సరాలుగా ఇసుక వేయలేదన్నారు. దీంతో పిల్లలు పడి దెబ్బలు తగులుతున్నాయన్నారు. పార్క్‌లో నాలుగు ఊయలలు ఉంటే అందులో మూడు పాడై రెండు సంవత్సరములైన నేటికీ కొత్తవి ఏర్పాటు చేయలేదన్నారు. జారుడు బండలు పగిలిపోయి మధ్యలో రంధ్రాలు ఏర్పడ్డాయని, వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లోని ఆట వస్తువులు కూడా విరిగిపోయినట్లు తెలిపారు. వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ప్రతి ఆదివారం ఎక్కువ సంఖ్యలో పిల్లలు, వారి తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులు వస్తున్నారన్నారు. పార్కులో రెండు టాయిలెట్స్‌లో ఫ్లోరింగ్ పగిలిపోయి ఉండటంతో వాటి వ్యర్థాలు బయటికి వచ్చి ఉపయోగించే వారికి ఇబ్బందిగా ఉందన్నారు. టాయిలెట్ల నుంచి బయటకు వెళ్లే మురుగునీరు పైపులు పగిలిపోయి వాటి వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. పార్క్ ఉత్తరం వైపున ప్రహరీ కూలిపోయిందన్నారు. దీంతో అక్కడ తాత్కాలికంగా పట్టలు కట్టారన్నారు. కుక్కలు, పందులు, పశువులు పార్కులోనికి వచ్చి నష్టం చేస్తున్నాయి వెంటనే ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. పార్కులో వాకర్స్ నడిచే ట్రాక్ కుంగిపోయినట్లు తెలిపారు. సుమారు 15 చోట్ల గుంతలు ఏర్పడి వాకర్స్ నడవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. పార్కులో లైట్లకు మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట్ల కొత్త లైట్లు బిగించాలన్నారు. రెండున్నర ఎకరాల్లో నిర్మించిన పార్కులో ఐదు మంది కార్మికులు కావాలని, ప్రస్తుతం ముగ్గురు కార్మికులు మాత్రమే పని చేస్తు న్నారన్నారు. కార్మికుల సంఖ్యను పెంచాలని, వారికి అవసరమైన పనిముట్లు, గడ్డి కోసే యంత్రం,ఆయిల్స్ ఇతర సామాగ్రిని సమకూర్చాలన్నారు. . **బోట్ క్లబ్:** బోట్ క్లబ్ ప్రారంభించి అభివద్ధి చేస్తామని పాలకులు రెండు బోట్లు పెట్టారని, అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఆ బోట్లకు తక్షణమే మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. నగరంలో సుందరీకరణ పేరుతో 100 కోట్ల కేటాయించారన్నారు. కేవలం రోడ్లకు రంగులు వేయటమే కాకుండా పార్కుల అభివృద్ధి కూడా సుందరీకరణలో భాగమేనన్నారు. నగరంలో 16 పార్కులు, 15 జిమ్‌ల్లో రిపేర్లు ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. పరిశీలనా బందంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. రమేష్, తంబి శ్రీనివాసులు, నగర నాయకులు టి.మహేష్, ఎస్‌డి.హుస్సేన్, దామా శ్రీనివాసులు ఉన్నారు


పార్క్‌లో పరిశీలిస్తున్న సిపిఎం బృందం


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పాకల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండల పరిధిలోని పాకల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థినీ, విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్. ప్రసాద్ తెలిపారు. అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన జూడో పోటీల్లో వివిధ వెయిట్ కేటగిరిలలో తమ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి.హజరత్తయ్య తెలిపారు. బాలికల విభాగంలో కె.లేఖనందన(-36), సిహెచ్.సుస్మిత (-40), వి.హిమశ్రీ(-44), వి.కీర్తి(-48), కె.దీపిక(-52), వి.శ్రావణి(-57), కె.మేరీ స్వీటీ(-63), వి.అంకమ్మ(-70) రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. బాలుర విభాగంలో ఈశ్వర్‌కుమార్(-40), ఎ. థామస్(-45), పి.ఉదయ్‌కుమార్(-50), కె.యాదగిరి (-55), వి.దిలీప్(-60), వి.ప్రశాంత్ ఎనోష్(-81) కిలోల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ విద్యార్థులు ఈనెల 23 నుంచి 24 వరకూ తిరుపతి జిల్లా రేణిగుంటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొన నున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన భాష్యం విద్యార్థులు

భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-టంగుటూరు


ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో ఈనెల 28 నుంచి 20 వరకూ జాతీయ స్థాయిలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో టంగుటూరు భాష్యం విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. ఎస్‌కె. రెహానా భాను ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఎం.ధరణి ప్రియ, ఎం. సాత్విక్ తతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఉత్తరాఖండ్ స్పోర్ట్స్ మినిస్టర్ రేఖఆర్య చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకష్ణ, ప్రకాశం జోన్ జెడ్ఇఒ కష్ణ గణేష్, ప్రిన్సిపల్ ఎస్‌కె. ఖాదర్ బాషా, కోచ్ యెహెూషువ తదితరులు అభినందించారు.

'శ్రీరామ్'లో అరుదైన శస్త్రచికిత్స

మహిళ కడుపు నుంచి 7 కిలోల గర్భాశయ కణితి తొలగింపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన సర్జరీ నిర్వహించారు. సీనియర్ ప్రసూతి, గర్భకోశ మరియు స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంతకుమారి ఆధ్వర్యంలో వైద్యుల బృందం మహిళ కడుపులోని 7 కిలోల అండాశయ కణితిని బుధవారం తొలగించారు. సర్జరీ విజయవంతం కావటంతో ఆ మహిళ డిశ్చార్జ్ అయింది. దర్శి ప్రాంతానికి చెందిన ఓ మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ డాక్టర్ చాపల శాంత కుమారిని సంప్రదించారు. డాక్టర్ శాంత కుమారి 8 నెలల గర్భవతి సైజులో ఉన్న ఆ మహిళ పొట్ట ను పరీక్షించి అతిపెద్ద అండాశయ కణితి ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. డాక్టర్ శాంత కుమారి, వైద్య బందం ఆపరేషన్ చేసి ఆ కణితిని విజయవంతంగా తొలగించారు. కణతి బరువు 7 కిలోల బరువు ఉంది. ఆపరేషన్ తరువాత ఆ మహిళ త్వరగా కోలుకుని ఆరోగ్యం కుదుటపడి సురక్షితంగా డిశ్చార్జ్ చేశారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ చాపల శాంతకుమారి, వైద్య బందాన్ని డాక్టర్ చాపల వంశీ కష్ణ, మహిళా బంధువులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల మొదటి గురువారం అన్ని వైద్య విభాగాలలో మల్టీ స్పెషాలిటీ వైద్యులతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గర్భిణీలకు స్కానింగ్, థైరాయిడ్, ఇసిజి, గుండె పరీక్ష, షుగర్ పరీక్షలు, హీమోగ్లోబిన్, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్ష, ఎముకల పటుత్వ పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, యూరిక్ ఆసిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ చాపల వంశీకృష్ణ కోరారు.


మహిళ కడుపునుంచి తీసిన కణితి


డాక్టర్ శాంతకుమారి


కంప్యూటర్ అందజేస్తున్న నల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు

కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని ఏలూరివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయులు నల్లూరి వెంకట శేషయ్య కంప్యూటర్ బహూకరించారు. నల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు పాలడుగు వెంకట నారాయణ చేతుల మీదుగా కంప్యూటర్, సిపియు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 కొల్లా శివాజీ మాట్లాడుతూ మండలంలో విద్యాభివద్ధికి నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య చేస్తున్న కషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కారక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, శ్రీను, ఫౌండేషన్ ప్రతినిధులు గోరంట్ల ప్రసాదు, పుట్ట శ్రీనివాసరావు, ఎంపిటిసి వేమా అశ్విని, పి.సురేష్, పమిడి ప్రసాదు, టిడిపి నాయకులు గోగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.


జయకుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌పి దామోదర్

జయకుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం ఈనెల 14 నుంచి 20 వరకూ నిర్వహించారు. కార్యక్రమ విజవంతానికి కృషి చేసిన సాంత్వనా సేవా సమితి సంస్థ డైరెక్టర్ రావినూతల జయకుమార్‌ను జిల్లా ఎస్‌పి ఎఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. బాలలకు అవగాహన కల్పించడంలో జయకుమార్ అందించిన సేవలను ఎస్‌పి కొనియాడారు. బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాలల అక్రమ రవాణా ప్రజల దష్టికి వచ్చినా, చూసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌పి కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యార్థులు సైబర్ నేరాలు, రోడ్ల ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫేక్ కాల్స్ పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సాప్ అకౌంట్‌లకు వచ్చే అనుమానిత లింక్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తం ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులకు ఫోన్లు,ఎటిఎం కార్డులు ఇవ్వరాదని తెలిపారు. మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న నేరాలపై పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపి : విద్యార్థులు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కొండపి సర్కిల్ సిఐ జి.సోమశేఖర్ తెలిపారు. కొండపి-కట్టావారిపాలెం గ్రామాల మధ్య ఉన్న హ్యాపీకిడ్స్ స్కూల్ విద్యార్థులకు సోషల్ మీడియా, ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నట్లు తెలిపారు. చిన్న వయస్సులో ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎస్ఐ ప్రేమకుమార్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు


తాడేపల్లిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- ప్రజాశక్తి, దర్శి



రేణింగవరంలో పొలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఒ

ల్యాండ్ కన్వర్షన్‌పై ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రేణింగవరంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం చీరాల ఆర్డీఒ తూమాటి చంద్రశేఖర్ నాయుడు గురువారం ఫీల్డ్ విజిట్ చేశారు. రేణింగవరం రెవెన్యూ సర్వే నెంబర్ 103/6ఏ లో ఒక ఎకరా 32 1/2 సెంట్ల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు సంబంధిత భూ యజమాని బి పద్మజా దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై పరిశీలన చేసేందుకు ఆర్డీఒతో పాటు తహశీల్దారు సింగారావు వచ్చి భూమిని సర్వే చేశారు. కార్యక్రమంలో విఆర్ఒ యు సుమతి, గ్రామ సర్వే ఆర్ రాజా, భూ యజమాని పద్మజా పాల్గొన్నారు.



సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ స్వరూపరాణి

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కె స్వరూపరాణి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్వహించే అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించి హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఒఆర్డి సుమంత్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి ఇమ్మానియేలు

ప్రజల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

ప్రజల హక్కులు, వాటి లక్ష్యంపై శిక్షణను బెంగుళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహకారంతో కార్డ్స్ ఎన్‌జిఒ సంస్థ, జెఎంజె, సోషల్ సర్వీస్ సంస్థ, కామధేను సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పచ్చతోరణం హాలులో గురువారం నిర్వహించినట్లు కార్డ్స్ ప్రతినిధి డైరెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. శిక్షణలో వివిధ అర్హతల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి, వాటిని ఎలా యాక్సెస్ చేయాలో తెలుసుకోవడానికి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను తెలుసుకోవడానికి, స్వీయ, సమాజం, అవసరమైన వాటాదారులకు సహాయపడుతుందని అన్నారు. వివిధ పథకాలు, సంస్థల కార్యాలయంలో మహిళల రక్షణ విధానం, దాని ప్రాముఖ్యత గురించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జాయింట్ కో ఆర్డినేటర్ అడ్వకేట్ కరుణరావు తెలిపారు. ఇమ్మనుయేలు మాట్లాడుతు ఆర్‌టిఐ యాక్ట్ గురించి వివరించారు. యువతీ, యువకులు ఎలా సమాచారాన్ని కోరవచ్చని వివరించారు. వారితో ప్రయోగాత్మకంగా అర్జీలు రాయించి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్ర్యమంలో కార్డ్స్ సోషల్ సర్వీస్ సంస్థ డైరెక్టర్ సుజాత, కామధేను సంస్థ డైరెక్టర్ ఉమా పాల్గొన్నారు.

సూర్యలంకలో 'సీ' విజిల్ ఆపరేషన్

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక మెరైన్ పోలీసు స్టేషన్, ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్ళ కొకసారి రెండు రోజులపాటు నిర్వహించే సీ విజిల్ ఆపరేషన్ గురువారం విజయవంతంగా ముగిసింది. మెరైన్, లోకల్ పోలీసుల ఆధ్వర్యంలో సూర్యలంకలో నిర్వహిచిన ఆపరేషన్‌లో ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్‌కు నోడల్ అధికారిగా డిఎస్పి జి రామాంజనేయులు వ్యవహరించారు. ప్రాదేశిక జలాల సంరక్షణ, పటిష్టత, తీర ప్రాంత భద్రత, రక్షణ అభివృద్ధి, చొరబాటు దారులు, వలస దారులు, తీవ్ర వాదులు, ఉగ్ర వాదులు వంటి అసాంఘిక శక్తులు భారత భూ భాగంలోకి ప్రవేశించకుండా నిరోధించడమే దీని ఉద్దేశ్యమని అన్నారు. ఇందులో భాగంగా సూర్యలంక మెరైన్ పోలీసుల అధ్వర్యంలో సీ విజిల్ ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. రెడ్ ఫోర్స్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయం, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, సూర్యలంక హరిత రిసార్ట్స్ పై డమ్మి (ప్రయోగాత్మక) సీ విజిల్‌కు ప్రయత్నించిన రెడ్ ఫోర్స్ సిబ్బంది మెరైన్ పోలీసులు వారిని ఆధీనంలోకి తీసుకొని సీ విజిల్ ఆపరేషన్ విజయవంతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూర్యలంక మెరైన్ సిఐ లక్ష్మారెడ్డి, బాపట్ల రూరల్ సిఐ గంగాధర్, మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.



సీ విజల్ ఆపరేషన్‌కు సిద్ధమైన పోలీసులు

వన సమారాధనతో ఐకమత్యం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

ప్రజాశక్తి - రేపల్లె

కార్తీక వన సమారాధన ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యమత్యం పెంపొందుతుందని మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు అన్నారు. ఓల్డ్ టౌన్ ప్రాచుర్ జమిందార్ కోట యందు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజారోగ్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు సిబ్బందికి కార్తీక వన సమారాధన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో వన సమారాధన ఏర్పాటు చేసుకోవడం చిన్న పెద్ద అనే ఉద్యోగులు తేడా లేకుండా సామూహికంగా భోజనాలు చేయడం సంతోషకరమన్నారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర రావు మాట్లాడుతూ ప్రతి ఏటా వన సమారాధన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ ఆర్థిక సహాయంతో ఈ వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కట్ట మంగ సుబ్బారావు, వైస్ చైర్మన్ విశ్వనాథ గుప్తా, సిపిఐ నాయకులు నాగాంజనేయులు, బాలాజీ, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు కె అంకమ్మరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, చొక్కాకుల శివశంకర్, వేణు, రాజేశ్వరి, దుర్గ, అరుణ, దుర్గారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్, వైస్ చైర్మన్లను ఘనంగా సత్కరించారు.



కమిషనర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

వరుస చోరీలతో ఉలిక్కిపడ్డ పర్చూరు ప్రజలు

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో వరుసగా నాలుగు చోట్ల దొంగతనాలు జరిగాయి. దీంతో ఒక్కసారిగా గ్రామస్తులు, షాపు యజమానులు ఉలిక్కిపడ్డారు. గ్రామంలో దొంగతనం చర్చనీమాంశంగా మారింది. దొంగతనం ఒకరు చేశారా లేక దొంగల టీం కలిసి చేసిందానేది తెలియాల్సి ఉంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. ఇంకొల్లు ఆర్ అండ్ బి రోడ్డులోని డ్రై ఫ్రూట్స్, మిల్క్ షాపు, సెల్ షాపులో దొంగతనాలు జరిగాయి. ఇదేవిధంగా చీరాల ఆర్ అండ్ బి రోడ్డులో ఒక ఆటోమొబైల్ షాప్, ఒక చిల్లర దుకాణంలో దొంగతనాలు జరిగాయి. దుకాణాల షెట్టర్లను గడ్డ పలుగుతో పగలగొట్టి లోపలకు ప్రవేశించి దొంగతనాలు పాల్పడ్డారు. క్లూస్ టీం వచ్చి ఆనవాళ్ళు సేకరించింది. ఆటోమొబైల్ షాపు, ఫ్రూట్ షాప్ ఉన్న సిసి కెమెరాలు ధ్వంసం చేసి దొంగతనంకు పాల్పడ్డారు. అయితే సెల్ షాపులోని సిసి కెమెరాలో దొంగతనానికి సంబంధించిన ఆనవాళ్లు నమోదయ్యాయి. గళ్లాలోని నగదు, వస్తువులను దొంగతనం చేసినట్లుగా తెలిసింది. నాలుగు షాపుల బాధితులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు. బాధితుల నుండి పోలీసులు వివరాలు సేకరించారు. బాధితులు చెప్పిన వివరాల ప్రకారం మనోజ్ డ్రైఫ్రూట్స్ షాపులో రూ.25వేల నగదు, మరో రూ.25వేల విలువైన డ్రై ఫ్రూట్స్ దొంగలించారని, స్టార్ ఆటో మొబైల్ షాపులో కంపెనీ వారికి చెల్లించేందుకు డెస్కులో పెట్టిన రూ.85వేల నగదు, సిసి పుటేజీలను తీసుకువెళ్లారని, మొబైల్ షాపులో రూ.5వేలు నగదు దొంగిలించినట్లు తెలిపారు. ఈ ఘటనలతో గ్రామంలో రాత్రిపూట పోలీసు గస్తిని పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దొంగతనం జరిగిన షాపులో పరిశీలిస్తున్న క్లూస్ టీం

సిసి కెమెరాల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

వివిధ రకాల వ్యాపారస్తులు తమ దుకాణాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వెంకట్రావు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యాపారస్తులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. నేర నియంత్రణలో సిసి కెమెరా పాత్ర కీలకమైనదని అన్నారు. అనేక ఘటనల్లో ముద్దాయిలను పట్టుకునేందుకు సిసి కెమేరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనేక నేరాల నియంత్రణలో సిసి కెమేరాలు ఉపయోగపడతా యని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కారించేడులోని వివిధ రకాల వ్యాపారస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్రావు



నూతనంగా ఎంపికైన యుటిఎఫ్ మండల కమిటీ

యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా హుస్సేన్, సురేష్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

యుటిఎఫ్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండి అల్తాఫ్ హుస్సేన్, వి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నికయ్యారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడేది యుటిఎఫ్ మాత్రమేనని సిఐటియు మండల కార్యదర్శి జి సుధాకర్ అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎం శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్‌కె బాజీ బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శివరామకృష్ణ, యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు మేలైన సేవలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రకృతి సిద్ధమైన సహజ ఎరువులను వాడడం ద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ టి బాలాజీ గంగాధర్ తెలిపారు. మండలంలోని కావూరు గ్రామం పరిధిలో జిపిపి పొలంబడి గురువారం నిర్వహించారు. రేపల్లె ఇన్చార్జి ఎడిఎ ఆర్ విజయ్ బాబు రైతులకు సూచనలు చేశారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన వేప నూనె, వేప పిండి, కషాయాలు వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతోపాటు నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి సిద్ధమైన ఎరువులు వాడడం ద్వారా భవిష్యత్తు కాలంలో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ఎఇఒలు ప్రియాంక, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైద్య, ఆరోగ్య శ్యాఖ మంత్రి సత్యకుమార్ శాసన మండలిలో మాట్లాడుతూ వంద ఎలుకలు తిన్న పిల్లి ప్రాయశ్చితం కోసం హాజ్ యాత్రకు వెళ్లిందంటని మాట్లాడటం బాధాకరమని మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మంత్రి హోదాలో ఉంటూ ఇలాంటి అనాలోచిత, అవాస్తవ, అవివేకమైన ప్రకటన చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రపంచ నలుమూలల నుండి ప్రతీయేటా 50లక్షలపై చిలుకు ప్రజలు అపురూపమైన ఐక్యతకు ప్రతీకగా భావించి అత్యంత పవిత్రంగా చేసే హాజ్ యాత్ర గురించి సామెతల రూపంలో మాట్లాడిన మంత్రి సత్యకుమార్ యావత్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని సలీం డిమాండ్ చేశారు. తిరుమల లడ్డు వివాదంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఇస్లాం ధర్మం గురించి, ప్రవక్తను కించపరిస్తే ముస్లిం సమాజం ఉరుకుంటుందాని వ్యాఖ్యనించడం చూస్తుంటే బిజెపి మతతత్వ రాజకీయం ఆంధ్రప్రదేశ్‌లో కులాలు, మతాలను టార్గెట్ చేస్తూ కూటమి నాయకుల ప్రవర్తన ఉందని అన్నారు.

అర్చకుల గృహ సముదాయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మిన్నేకల్లులో అర్చకుల గృహ సముదాయం నిర్మాణానికి శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి గురువారం శంకుస్థాపన చేశారు. శృంగేరి పీఠం ఆధ్వర్యంలో మిన్నేకల్లు గ్రామ ప్రజల తోడ్పాటుతో మహామాతృశ్రీ తంగిరాల అనంత లక్ష్మమ్మ స్మారక కళ్యాణ మండపం నందు రూ.40లక్షలతో నిర్మించనున్న అర్చకుల గృహ సముదాయం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఆలయాల నందు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్, కళ్యాణ మండపం ఇన్‌చార్జి బొల్లినేని రామకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ

నేడు ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఉన్న వికలాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ జె.వెంకట మురళి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చారు. ప్రతి నెలా నాలుగో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కేవలం ఎస్టీల కోసం గ్రీవెన్స్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న వికలాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం క్యూలో నిలబడి ఇబ్బందులు పడకుండా వారి కోసం ప్రత్యేకంగా ప్రతి నెలా మూడో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ రెండు గ్రీవెన్సులకు జిల్లా అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు. ప్రత్యేక గ్రీవెన్స్ జరిగే రోజు మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని.. వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసం శ్రద్ధ పెట్టారు. జిల్లా అధికారులందరూ ప్రతినెలా ఈ రెండు రోజులు కేవలం వికలాంగులు, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాలని చెప్పారు.

జిల్లాలో 75 వేల మంది ఎస్టీ జనాభా ఉండగా వీరిలో 3,712 మందికి ఆధార్ కార్డులు లేనట్లు గుర్తించారు. వికలాంగుల వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఆధార్ కార్డులు లేని ఎస్టీల సర్వే పక్కాగా నిర్వహించి.. వారికి ఆధార్ కార్డు అందేలా చూసి పొందిన ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వారికి వర్తింపజేసే చర్యలు


చీరాల, యానాది కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చేపట్టారు. కొన్ని ఎస్టీ కుటుంబాలు ఉపాధి కోసం హైదరాబాద్, పలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించారు. వారు తిరిగి తమ స్వగ్రామాలకు వచ్చిన వెంటనే ఆధార్ కార్డు ఇచ్చి ఉపాధి కల్పించే దిశగా కలెక్టర్ అదేశాలిచ్చారు. కాగా చీరాల మండలం, బేరిపురం బుర్లవారిపాలెం కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని గిరిజన సంఘాల నాయకులు ఇటీవల కలెక్టర్‌ను కలసి విజ్ఞప్తి చేయడంతో తక్షణమే ఇంజినీరింగ్ అధికారులను అక్కడికి పంపి అంచనాలు వేయించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నా రు. గిరిజన భవనం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపను న్నారు. చీరాల మండలం, ఈపురు పాలెం కాల్వకట్టపై నివాసం ఉం టున్న ఎస్టీ గహాలను కలెక్టర్ ఇటీవల పరిశీలించారు. ఎస్టీలు నివాసముం టున్న ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ చలించిపోయారు. వారికి కావలసిన ప్రాథమిక అవసరాలు యుద్ధప్రాతిపదికన తీరుస్తామని హామీ ఇచ్చారు. కాల్వలో చేపల వేటతో అత్యంత నిరుపేదలుగా జీవనం సాగిస్తున్న వారికి అన్ని విధాలుగా అండగా ఉంటాన న్నారు. జాబ్ కార్డులు జారీ చేసి సమీపంలోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని, కనీస కూలీ వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటామ న్నారు. వీధి విద్యుత్ దీపాలు, మంచినీటి కొళా యిలు ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి ప్రీ స్కూల్ నిర్వహణ, చిన్నారులకు పౌష్టికాహారం అందుబాటులోకి తెస్తామన్నారు. అక్కడి పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి అవసరమైన ఆటోను మంజూరు చేసి.. సమస్య పరిష్కరిస్తామన్నారు. చీరాల మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద తోపుడుబండ్లపై వ్యాపారం నిర్వహించుకుంటున్న నక్కల జాతికి చెందిన 18 కుటుంబాల వారు కలెక్టర్‌ను కలిసి తమ జీవనోపాధికి ఆటంకం కలిగించకుండా, రాత్రి సమయాలలో నిద్రించడానికి ఆశ్రయం కల్పించాలని కోరడంతో తగిన చర్యల కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఒక్కో అధికారి నాలుగు ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకుని ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేసేలా అధికారులందరికీ ఆదేశాలిచ్చారు.

సంక్రాంతికి ముందే కాలుదువ్వనున్న పందెం కోళ్లు

- కోడి పందెం బరులు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు
- ఇప్పటి నుండే రూ.లక్షల్లో పందెం కడుతున్న వైనం
- కాపురాలు గుల్ల చేసుకుంటున్న పందెం రాయుళ్లు
- పోలీసులే పందెం కోళ్లను పెంచుతున్నారని ప్రచారం

ప్రజాశక్తి - కర్లపాలెం

సంక్రాంతి వస్తుందంటే తగ్గేదే లే అంటూ పందెం రాయుళ్ళు రెడీ అవుతున్నారు. సంక్రాంతి పండుగ అంటే భోగి మంటలు, పిండి వంటలు, హరి దాసులు, బసవన్న లు, ముగ్గులు, ఊరంతా పండగ. ఇవి మాత్రమే కాదు. కోడి పందేలు కూడా కన్పిస్తాయి. ఇక సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో అనేక రకాల నాటు కోడి పుంజుల తో పందెం రాయుళ్లు పందాలుకు సిద్ధమం అతున్నారట. ఈపాటికే అనేక రకాల నాటుకోడి పుంజులను పందెం రాయాళ్ళు వివిధ ప్రాంతాలను నుండి తీసుకువస్తున్నారు. సంక్రాంతికి ఆరు నెలల ముందు నుంచే ఈ పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు. పందెకు రెడీ చేసే కోడి పుంజుల్లో కూడా చాలా రకాలుంటాయి. వాటిలో గౌడ నెమలి, తెల్లనెమలి, కోడి నెమలి, కాకి డేగ, కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కుక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు ఉంటాయి. వీటిలో తెల్ల నెమలి, గౌడ నెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎంతటి పందెంనైనా నెగ్గే శక్తి ఉంటుందట. ఒక్కో



పుంజు ఖర్చు రూ.వేల నుంచి రూ.లక్షల వరకు ఉంటుంది. పందెలో పాల్గొనే పుంజులకు బలమైన ఆహారం ఇవ్వడంతో పాటు కొన్ని నెలల నుంచి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పందెలలో తట్టుకునే విధంగా శిక్షణ ఇస్తారు.

ఇప్పటి నుండే పందెంకు రూ.లక్షల్లో పెట్టుబడి

పౌరుషానికి ప్రతిరూపాలు పందెంకోళ్లు. కత్తికట్టి బరిలోకి దించితే యజమాని పరువు కోసం ప్రాణాలు పణంగా పెట్టి కొట్లాడుతుంది. అలాంటి కోడి పందేల కోసం ఇప్పటి నుండే జోరుగా పందెంకు రూ.లక్షల్లో డబ్బు కలుపుతున్నారు. పందెం కోడిని బట్టి పందెం నిర్ణయిస్తున్నారు. రాబోయే సంక్రాతి పండగ సందర్భంగా జరిగే కోడి పందెలు రూ.లక్షల్లో జరిగే అవకాశం ఉందనే చర్చ వినిపిస్తుంది.

కాపురాలు గుల్ల చేసుకుంటున్న పందెం రాయుళ్లు

సరదాగా నిర్వహించే కోడి పందానికి హాజరయ్యే కోడి పందెందారులు వారి జేబులను గుల్ల చేసుకోవడమే కాకుండా కుటుంబాలను ఆర్థికంగా దెబ్బ తీసుకుంటు న్నారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో పందానికి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం లోనైనా ఈ కోడి పందేలను అరికట్టి ప్రజల జేబులు గుల్ల కాకుండా చూస్తారమోననే ఆశాభావం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

వీరిపై పోలీసు నిఘా ఉంటుందా..?

సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోనే పందెంబరులు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. జిల్లాలో కోడి పందెంలను అరికట్టి పందెంరాయిళ్ల ఆట కట్టించాలని, నియోజకవర్గంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించిన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పందెం కోళ్లను పెంచుతున్నట్లు పోలీసులపై ఆరోపణలు

రాబోయే సంక్రాతి పండుగ నియోజకవర్గంలో కోడి పందెంలు నిర్వహించడానికి భారీ ఎత్తున కోళ్లను తీసుకువస్తున్నారు. కోడిని బట్టి వాటి ధరను నిర్ణయిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే కొందరు పోలీసులే పందెం కోళ్లను పెంచుతున్నారనే చర్చ జోరుగా జరుగుతుంది. విరిపై పోలీసు ఉన్నతధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని మండల ప్రజలు గుసగుసలు ఆడుకుంటున్నారు.

అంగన్‌వాడీ పిల్లలు..ఆంగ్లంలోనూ అదరగొడుతున్నారు.!

ప్రజాశక్తి - పంగులూరు

వాళ్లంతా మూడు నుండి నాలుగేళ్ల లోపు పిల్లలే అయి నా ఎబిసిడిలు టకటకా చెప్పేస్తారు. టీచర్ ఇంగ్లీషులో మాట్లాడిన కూడా సమాధానం చెబుతారు. ఇదే మని టీ చర్ని అడిగితే 'మా పిల్లలకు చిన్నప్పటి నుండే ఇంగ్లీష్ నేర్పు తున్నాను' అని చెప్పారు. ముప్పవరం గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ కార్యకర్త పమిడి సుధారాణి. మండ లంలోని ముప్పవరంలో గిరిజన కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఉదయం 'ప్రజాశక్తి' పరిశీలించింది. అక్కడున్న పిల్లల చదువులు గురించి కార్యకర్త సుధారాణిని ప్రశ్నించగా ఆ పిల్లలంతా ఇంగ్లీష్ అక్షరాలను ఏది అడిగినా చెబుతున్నారు. ఏ నుండి జెడ్ వరకు అక్షరాలు చెప్పేస్తు న్నారు. తమ వద్ద చదువుకున్న పిల్లలు ఎలిమెంటరీ పాఠశా లకు వెళితే పాఠాలు సులభంగా చదవ గలుగుతున్నారని చెప్పారు. అక్కడి ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చదువుకుంటున్నారని తెలిపారు. ఈ కేంద్రం నుండి గత ఏడాది ఏడుగురు పిల్లలను ప్రాథమిక పాఠశాలకు ప్రమోట్


పిల్లలకు పాఠాలు చెబుతున్న అంగన్వాడీ కార్యకర్త సుధారాణి

చేశామని, రానున్న విద్యా సంవత్సరానికి మరో ఏడుగురు పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపేందుకు ప్రమోట్ చేస్తున్నామని చెప్పారు. పిల్లలకు చదువుతోపాటు ఆరోగ్యంపట్ల అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. ఇక్కడ పిల్లలకు భోజన సమయంలో దగ్గరుండి హ్యాండ్ వాష్ చేయిస్తున్నామని తెలిపారు. హ్యాండ్ వాష్ చేసుకోకుండా ఏ పిల్లవాడు భోజనం చేయడని తెలిపారు. గిరిజన కాలనీలోని కేంద్రమైనప్పటికీ పిల్లలకు పరిశుభ్రత, చదువు గురించి మంచి అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం పరిధిలో 9మంది గర్భిణీ స్త్రీలు, ముగ్గురు బాలింతలు, 15మంది కిషోర్ బాలికలు, ఆరు నెలల నుండి మూడేళ్లల్లోపు పిల్లలు 30మంది ఉన్నారని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు నెలకు మూడు కిలోల బియ్యం ప్యాకెట్, ఒక కిలో కందిపప్పు, 450 గ్రాములు ఆయిల్, ఐదు లీటర్ల పాలు, 25 గుడ్లు, బాల సంజీవని కిట్టు ఇస్తున్నామని చెప్పారు. కిషోర్ బాలికలకు ఐరన్ టాబ్లెట్లు ఇస్తున్నామని అన్నారు. ఆరు నెలల నుండి మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతం, 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తున్నామని చెప్పారు. మూడేళ్ల నుండి ఐదేళ్లలోపు పిల్లలకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని చెప్పారు. పాఠశాలలో 12మంది పిల్లలు హాజరు కావలసి ఉండగా ప్రస్తుతం 11మంది హాజరవుతున్నారని తెలిపారు. ఆయా కత్తి రేణుక మాట్లాడుతూ పిల్లలందరినీ ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి కేంద్రానికి తీసుకొస్తానని, మళ్లీ వాళ్లని వాళ్ళ ఇళ్లకు తీసుకెళ్లి వదిలిపెడతానని చెప్పారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ బి శింగయ్య

నూతన పెన్షన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - అద్దంకి

గ్రామాల్లో నూతనంగా పింఛన్నలు, గృహాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలని ఎంపిడిఒ బి సింగయ్య అన్నారు. మండలంలోని చక్రాయపాలెం, సింగరకొండపాలెం సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల కాలంలో సచివాలయ సిబ్బంది పనితీరు, హాజరు వ్యవహారాలపై వివరాలు పరిశీలించారు. ఎస్టీ కుటుంబాల సర్వే రివే ఫికేషన్ గురించి పర్యవేక్షించారు. సిబ్బంది సమయపాలన సచివాలయ విధులు ఎలా నిర్వహిస్తున్నారని పరిశీలించారు.

అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలో కొంత మంది అధికారులు అధికార పార్టీ నాయకులు ఆదేశాలతోనే పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల మౌఖిక ఆదేశాలకు ఎటువంటి నిబంధనలు పాటించకుండా పనిచేస్తున్నారని, అధికార పార్టీ నేతల ఆదేశాలతో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఏ పని కావాలన్నా అధికార పార్టీ నేతల సిఫార్సులు లేనిదే పనులు కావడం లేదని సామాన్య ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మూడు ఆకులు తింటే మాకేం తక్కువ అన్నట్లు ఇప్పుడు అధికారులు ఆరు ఆకులు తింటాం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొన్ని రేషన్ షాపులపై పదేపదే అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమాలు జరుగుతున్న షాపులకు మాత్రం ఎలాంటి తనిఖీలకు సైతం వెళ్లడం లేదు. అన్ని తెలిసినప్పటికీ అధికారులు మిన్నకుండి పోతున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారాలపై రాష్ట్ర మంత్రి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



అవార్డు అందించి విజయను సన్మానిస్తున్న అమాత్యులు

విజయకు బెస్ట్ ఫిషరీస్ అవార్డు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్లకు చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ బెస్ట్ ఫిషరీస్ ఎంట్రప్రెన్యూర్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అనంత విజయకు ఈ అవార్డును మత్స్య శాఖ మంత్రి అచ్చెం నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. దేశవ్యాప్తంగా కోర్టల్ ఆక్వా ఆథారిటీ దేశ వ్యాప్తంగా 462మందికి ఈ అవార్డులను ప్రకటించింది. అందులో బాపట్లకు చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ ఆవార్డు అందుకున్నట్లు జాతీయ మత్స్యకార రాష్ట్ర అధ్యక్షులు అనంత నగేష్ బాబు తెలిపారు. తీర ప్రాంతంలో మత్స్యకార మహిళ జాతీయ స్థాయి అవార్డు అందుకోవడంపట్ల పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు అభినందించారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు ఎంపీ మాగుంటకు వినతి



మాగుంటకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ మీటర్ రీడర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని మీటర్ రీడర్స్ యూనియన్ నేతలు కోరారు. రాంనగర్ 2వ లైన్‌లోని కార్యాయలంలో ఎంపీ మాగుంటను గురువారం కలిసి ఈ మేరకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఎపిసిపిడిసిఎల్‌లో మీటర్ రీడింగ్ తీస్తూ సంస్థకు వెన్నుముక్కలాగా ఉంటూ పనిచేస్తున్నామన్నారు. సంస్థకు ఆదాయం తేవడంలో మీటర్ రీడర్స్ పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్ల రూపంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు, సిమ్ సిస్టం వస్తే నెలానెలా రీడింగ్ తీసే పని ఉండదన్నారు. ఇన్నాళ్లు విద్యుత్ సంస్థను నమ్ముకొని పనిచేస్తున్న మీటర్ రీడర్స్ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. తమను విద్యుత్ సంస్థలో షిఫ్ట్ ఆపరేటర్లుగా, వాచ్‌మెన్, బ్రేక్ డౌన్ గ్యాంగ్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా, అటెంటర్‌గా తీసుకోవాలని కోరారు. దీంతో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్పందిస్తూ మీటర్ రీడర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుంచాల సిద్దయ్య, శివ, నాగార్జున ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు బి.సిద్ధయ్య, కార్యదర్శి నాగార్జున రెడ్డి, విజయ్, దత్తు, శివప్రసాద్ పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయింపులు పెంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ రూ.394 కోట్లు ఏమాత్రం సరిపోవని, ఈ బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.2,000 కోట్లు విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. సిపిఎం సభ్యుల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సిబ్బంది జీతభత్యాలకు, ఎండింగ్ బిల్లులు చెల్లించేందుకు మాత్రమే సరిపోతుందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ప్రాజెక్టు పనులు ప్రారంభం కాలేదన్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుత కేటాయింపులు చూస్తుంటే మరో 10 ఏళ్లప్రాజెక్టు నిర్మాణాన్ని ఇలానే కొనసాగించే పరిస్థితి కనపడుతోందన్నారు. రూ.4,500 కోట్లు చేస్తే తప్ప ప్రాజెక్టు పనులు పూర్తి కావని తెలిపారు. అధికార టిడిపి కూటమి, ప్రతిపక్షం కేంద్ర ప్రభుత్వానికి వంతపలుకుతూ రాష్ట్ర హక్కులు, ఆదాయాలను తాకట్టు పెట్టే పరిస్థితి తీసుకొస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం గురించి పదే పదే ఉచ్చరిస్తున్నాడని సనాతన ధర్మం అంటే మనుధర్మం అమలు చేయడమేనని తెలిపారు. సనాతన ధర్మానికి సంపూర్ణ మైన అర్థం తెలుసకోవాల్సిన అవసరం ఉప ముఖ్యమంత్రికి ఉందన్నారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం జెండాను జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన పోరాటాలు, ఉద్యమాలను గురించి బడుగు వెంకటేశ్వర్లు సభ్యులకు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంపూర్ణ నిధులు కేటాయించాలని, ఒవి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని, హాజీపురం చెరువుకు సబ్ ఛానల్ నిర్మించి దోమలేరు నీటిని మళ్లించాలని, చెరువు అభివద్ధికి కృషి చేయాలని, ఆక్రమణలను అడ్డుకోవాలని హాజీపురం, మిట్టపాలెం, పెద్ది వెంకటయ్య పల్లెలో అక్రాంతమైన భూములు పేదలకు పంచాల్నఇ, మండల కేంద్రంలో 24 గంటలు వైద్య సౌకర్యం కల్పించాలని కొమ్మల చిన్న రామయ్య తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. పిసిపల్లె మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని, ప్రతి ఇంటికి సాగర్ జలాలు పంపిణీ చేయాలని, కిడ్నీ బాధితులకు వాహన సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, కోదండరాంపురంలో అన్యాక్రాంతమైన దళితుల భూములను తిరిగి వారికే అప్పజెప్పాలని పిసిపల్లి శాఖ కార్యదర్శి మహేష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శులు కత్తి ఏబు, ఏలియా, నాగయ్య, వెలుగొండయ్య వినయ్, రాములు, రమేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి


కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద ఈనెల 26న నిర్వహిస్తున్న మహాధర్నాలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నేతలు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, కర్షకులు, ప్రజలు సమస్యలు పరిష్కరించ కుండా అదానీ, అంబానీలో ఆస్తులు పెంచే పద్ధతిలో బిజెపి ప్రభుత్వ విధానాలు సవరిస్తుందన్నారు. అందుకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ,ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రైవేట్‌కు అప్పగించొద్దని, నేషనల్ మోనిటీస్ విధానాన్ని రద్దు చేయాలని, దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికు రెగ్యులర్ చేయాలని ,స్కీమ్ వర్కర్ల పని చేస్తున్న కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు భవనం నిర్మాణం , హమాలీ, ఆటో, రవాణా రంగాల్లో కార్మికులకు సమగ్రమైన సామాజిక సంక్షేమం అమలు చేయాలన్నారు. కొత్త పెన్షను స్కీములు రద్దు చేసి పాత పెన్షను పథకం పునరుద్ధరించాలన్నారు. కనీసం ఇపిఎఫ్ పెన్షన్ రూ.9000 ఇవ్వాలన్నారు. రైతులు ఉత్పత్తులకు ,ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువకు మరో 50 శాతం కలిపి కనీసం మద్దతు ధర ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులో రుణా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ పన్ను 32 శాతానికి పెంచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు, బడా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు, నగర ఉపాధ్యక్షులు జి.రమేష్ , దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, కొర్నెపాటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు జివి .సుజాత, యు.రత్నకుమారి, ఎమ్‌డి. యాసిన్, ఎస్‌డి హుస్సేన్, నాయకులు పి. సుబ్బారావు, కోటేశ్వరరావు, టి. విజయ వెంకట్రావు, బాబు పాల్గొన్నారు



చీమకుర్తిలో మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

చీమకుర్తి : ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు తెలిపారు. గురువారం స్థానిక పంగులూరి కష్ణయ్య భవనంలో మండల రైతు సంఘం కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పమిడి వెంకట్రావు మాట్లాడుతూ ఈనెల 26న దేశవ్యాప్తంగా 500 జిల్లా కార్యాలయాల వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 26న ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తునన మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగాన్ని క్రమక్రమంగా కార్పొరేట్లకు అప్పగించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయని పేర్కొన్నారు. స్వామినాథన్ సిఫారసుల అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని అండ్ డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యల నివారణకు రుణ విమోచన చట్టాన్ని తేవాలని, కార్మికులకు నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి వారికి హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, మాదాల నారాయణ, కొల్లూరి అక్కయ్య, మంగమూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పశువులలో వచ్చే బ్రూసెల్లా వ్యాధి నియంత్రణకు ఇచ్చే టీకా కార్యక్రమ పోస్టర్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆడ పశువులలో గర్భస్రావానికి, మగపశువులలో కీళ్ళ వాపుల వంధత్వానికి కారణమయ్యే బ్రూసెల్లా వ్యాధి నియంత్రణకు ఈనెల 20 నుంచి డిసెంబర్ 19 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఉన్న ఈ వ్యాధికి జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా నాలుగు నుంచి 8 నెలల వయస్సు ఉన్న పెయ్య దూదలకు టీకాలు వేస్తామన్నారు. ఒక్కసారి ఈ టీకా వేస్తే జీవితంలో మరెప్పుడు ఈ వ్యాధి రాదని తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించి పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి



కూరగాయ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మహిళలు మానసికంగా, శారీరకంగా ఉండటానికి అధిక పోషకాలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలని కందుకూరు కషి విజ్ఞాన కేంద్రం గహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. నీహారిక తెలిపారు. మండల పరిధిలోని కలికివాయ, బింగినపల్లి గ్రామాల్లోని మహిళలు, రైతులకు సామూహిక పౌష్టికాహార పెరటి తోటల పెంపకంపై గురువారం ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీహారిక మాట్లాడుతూ 100 గ్రాముల తాజా పండ్లు, 400 గ్రాముల కూరగాయలు మరియు ఆకుకూరలు ప్రతిరోజూ తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన సూక్ష్మ పోషకాలు సమపాలనలో అందుతాయని తెలిపారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీంతో జీవన శైలి వ్యాధులను (గుండె జబ్బులు, మధుమేహం, కీల నొప్పులు, కేన్సర్) అరికట్ట వచ్చునని తెలియజేశారు. పౌష్టికాహార పెరటి తోటల్లో పండించే తాజా పండ్లు మరియు కూరగాయలు నిత్యం అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం ఆరు రకాల పండ్లమొక్కలు, 8 రకాల కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎన్‌ఎఫ్ ఎస్‌డిఎ వెంకటరమణ, ఐసిఆర్‌పిలు సుమతి, సుహాషిణి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.